# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 18-11-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నైజీరియాతో ద్వైపాక్షిక సంబంధాలు మరింత మెరుగుపరిచేందుకు భారతదేశం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.**
2. **ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు పలు ప్రధాన బిల్లులను ప్రవేశపెట్టనుంది.**
3. **దేశంలో వరిసాగు ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు.**
4. **ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం కొనుగోలుకు సంబంధించి వాట్సాప్ మాధ్యమం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సేవలందించనుంది.**
5. **తెలంగాణలో ఈరోజు నుంచి కొత్త విద్యుత్ వాహనాల విధానం అమల్లోకి వస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**

==========================

నైజీరియాతో ద్వైపాక్షిక సంబంధాలు మరింత మెరుగుపరిచేందుకు భారతదేశం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా నిన్న నైజీరియా చేరుకున్న ప్రధాని అబుజాలోని నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబుతో సమావేశమయ్యారు. నైజీరియా ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోదీని ఆ దేశ అత్యున్నత పురస్కారమైన " గ్రాండ్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ద నైజర్" అవార్డుతో సత్కరించింది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఈ గౌరవాన్ని భారతదేశ ప్రజలకు అంకితం చేస్తున్నానని అన్నారు. ఉగ్రవాదం వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి నైజీరియా, భారత్ దేశాలు సమిష్టిగా కృషిచేస్తున్నాయని ప్రధాన మంత్రి పేర్కొంటూ,

వాయిస్ ( 40 సెకన్లు)

--------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన సభ సమావేశాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు పలు ప్రధాన బిల్లులను సభలో ప్రవేశపెట్టనుంది. పంచాయతీ రాజ్ బిల్లును ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ ప్రవేశపెడతారు. దీనితో పాటు ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణల నిరోధక బిల్లు, ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సొసైటీ బిల్లు, మునిసిపల్ లా బిల్లు, డాక్టర్ ఎన్.టి.ఆర్. ఆరోగ్య విశ్వవిద్యాలయానికి సంబంధించిన బిల్లులను కూడా సంబంధిత మంత్రులు

శాసన సభలో ప్రవేశ పెట్టనున్నారు.

---------------------------

దేశంలో వరిసాగు ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా తెలిపారు. తెలంగాణలో వరి సాగు విస్తీర్ణం గత ఏడాది 25 లక్షల ఎకరాల్లో ఉండగా, 61 శాతం అంటే 40 లక్షల ఎకరాల మేరకు పెరిగి 66.77 లక్షల ఎకరాలకు చేరుకుందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేసిన అయిదు వందల రూపాయల అదనపు రుసుము వల్ల దిగుబడిలో 153 లక్షల టన్నులతో రికార్డు నమోదైందని చెప్పారు. ఇంత వరకు పౌర సరఫరాల శాఖ దాదాపు 10 లక్షల టన్నుల ధాన్యాన్ని లక్షా 41 వేల మంది రైతుల నుంచి కొనుగోలు చేసిందని తెలిపారు. తెలంగాణ రైతులు దేశానికే గర్వకారణమని ముఖ్యమంత్రి రైతులను అభినందించారు.

---------------------------

రైతులు పండించిన పంటకు మద్దతు ధర అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సూర్యాపేటలో కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. వ్యవసాయ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ధాన్యం విక్రయించే రైతులు కొనుగోలు నిబంధనల మేరకు మద్దతు ధర పొందాలన్నారు. ధాన్యం అమ్మకంలో రైతులు తీసుకోవాల్సిన చర్యలను మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం మరింత సులభతరం చేసిందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతుల సమయం వృధా కాకుండా వాట్సాప్ ద్వారా ఈ సేవలు అందిస్తామని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇందు కోసం "7337359375" నంబర్‌ను కేటాయించామని వెల్లడించారు. ధాన్యం అమ్మదలచిన రైతులు ఈ మొబైల్ నంబర్‌కు " హాయ్ " అని సందేశం పంపగానే కృత్రిమ మేధ ఏఐ ద్వారా ప్రత్యేక వాయిస్‌తో సేవల వినియోగంపై సమాచారం వస్తుందని నాదెండ్ల మనోహర్ వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిన్న మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం పంచాయతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిధులు కేటాయించిందని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. సంక్రాంతి నాటికి అన్ని గ్రామాల్లో 4 వేల 5 వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని మంత్రి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని నగరపాలక సంస్థలు, మునిసిపాలిటీలు, నగర పంచాయతీలలో భవన నిర్మాణాలకు సంబంధించిన అనుమతులకు కొత్త విధానాన్ని తీసుకువస్తున్నామని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ

తెలిపారు. నెల్లూరులో మునిపల్ శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ (27 సెకన్లు)

---------------------------

తెలంగాణలో ఈరోజు నుంచి కొత్త విద్యుత్ వాహనాల విధానం అమల్లోకి వస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లో మంత్రి నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యుత్ వాహనాలకు రిజిస్ట్రేషన్ రుసుం మినహాయింపు ఇస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా వినియోగదారులకు ఏడాదికి సుమారు లక్ష రూపాయల ఆదాయం ఆదా అవుతుందన్నారు. ఈవీ పాలసీలో విద్యుత్ శక్తితో నడిచే ద్విచక్ర వాహనాలు, ఆటో, బస్సులకు వందశాతం పన్ను మినహాయింపు ఉంటుందని చెప్పారు. ప్రజలు విద్యుత్ వాహనాలను కొనుగోలుకు చేయాలని అని మంత్రి కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో జరిగిన రహదారి ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. ఒంగోలు మండలం కొప్పోలు గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్రవాహనంపై వెళుతూ ముందు వెళ్తున్న వాటర్ ట్యాంకర్‌ని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

---------------------------

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా హనుమకొండలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క అన్నారు. హనుమకొండలో నిన్న వారు మాట్లాడుతూ, రేపు నిర్వహించే ఈ సభకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. సభావేదికకు ఇందిరా మహిళా శక్తి ప్రాంగణంగా నామకరణం చేశామని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరింటిలో ఐదు గ్యారంటీలను అమలు చేశామని, హైదరాబాద్ తర్వాత వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని, వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటుపై చర్యలు చేపడుతున్నామని మంత్రులు తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని చింతలపూడి ఎత్తిపోతల ప్రాజెక్ట్ నిర్మాణాన్ని రానున్న ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి చేస్తుందని ఏలూరు పార్లమెంట్ సభ్యులు పుట్టా మహేష్ కుమార్ తెలిపారు. ఏలూరు జిల్లా నూజివీడులో ఎంపీ నిన్న మాట్లాడుతూ, పోలవరం, చింతలపూడి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయగా, డిసెంబర్ నుంచి పనులు ప్రారంభించనున్నామని తెలిపారు. నూజివీడు నియోజకవర్గంలో మామిడి అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. తద్వారా రైతులకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు యువతకు ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లభిస్తాయని మహేష్ కుమార్ వెల్లడించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 116వ సంచిక ఈనెల 24వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 22వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

పల్నాటి వీరుల ఆరాధనోత్సవాలు ఈ నెల 30 నుంచి డిసెంబర్ 4వ తేదీ వరకు నిర్వహిస్తామని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. పల్నాడు జిల్లా కారంపూడిలోని ఉత్సవాల గోడపత్రికను నిన్న ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జూలకంటి బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తామని అన్నారు. పల్నాటి వీరుల ఆరాధనోత్సవాల్లో భాగంగా నిర్వహించే చాపకూటి సహపంక్తి భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నామని బ్రహ్మానందరెడ్డి వివరించారు.

======================